ఓం శ్రీసాయిరాం

మానవుడు సుఖమునే ఆశించి దాన్ని పొందవలెనని జీవితమంతా పరుగెడతాడు. అయితే, సుఖము యిట్టిది, అట్టిది అనే నిశ్చయబుద్ధి లేక, ఏది లభించినా దానికన్న ఇంకొకటి ఎక్కువ సుఖమునందించును అనే భ్రాంతిలో పడిపోవుచున్నాడు. బాహ్యపదార్థములనే, బాహ్యవిషయములనే ఆశ్రయించి తద్వారా నిరాశకూ, అశాంతికీ గురియైపోతున్నాడు. లోతుగా విచారణ జరిపిన సుఖములకంత్యమెక్కడ? బాహ్యవస్తువులందించే సంతృప్తి ఎట్టిది? పుట్టిన క్షణమునుంచి గిట్టే క్షణము వరకు సుఖము, సుఖము అని దానివెంట తిరిగి పరుగెడుతూ కాయమును, కాలమును దాని కొరకు అంకితముచేసే మానవుడు తాను ఆనందస్వరూపుడు, అమృతస్వరూపుడు, మధురస్వరూపుడు అనే నిజమును మరచి బాధపడుచున్నాడు,అంతే!

సుఖశాంతులు దేహనిమిత్తమా, ఇంద్రియముల నిమిత్తమా, మనస్తృప్తి నిమిత్తమా అనే ప్రశ్నలటుంచి అసలు తాను దేహమా, ఇంద్రియమా, మనసా లేక వీటికతీతమైన ఆత్మయా అనే విచారణను మానవుడు మొట్టమొదట సలుపాలి. దేహమనేది ఒక ఘటము మాత్రమే. జాతి, కులము, మతము, రూపము, నామము ఇవన్నియువీ ఆ ఘటమునకు సంబంధించినవే. కాని, ఆకాశమువలె సర్వవ్యాపియై నిర్గుణనిరాకారమై ఆ ఘటములో దాటియున్న ఆత్మకు అంటునది కాదు.

తాను జడమైన స్థూలశరీరము కాదు. ఆ ఘటములోని జలము తానుకాదు. అంటే కామక్రోధాదులు, ద్వైతభావములు మొదలైన వికారములు, సూక్ష్మశరీరముకూడ తానుకాదు. కారణస్వరూపుడుకూడ తానుకాదు. తాను నిరాకారుడు. క్షణికమైన అశఆశ్వతమైన ఆకారముతో, నామముతో బంధమున్నట్టుగా నటించేవాడు. అంతే! మృణ్మయమై భాసమయ్యే ఈ జడము, ప్రాపంచికము. చిన్మయమైన దానిలోని నిజతత్త్వము ఆధ్యాత్మికము. అయితే, ఋక నిముషమును గట్టిగా మనస్సుకు తీసుకోవాలి. పాత్రయందు మట్టి వుంది. కాని, మట్టిలో పాత్ర లేదు. దేహమందు ఆత్మ వున్నది. కాని, ఆత్మలో దేహము లేదు. పాత్రము కల్పితము, అనిత్యము, అసత్యము. ఆత్మ నిత్యము, సత్యము. కాబట్టి, మానవుడు సర్వాధారమైన ఆత్మను తెలుసుకోవలెను.

తెలివి అంటే, దానిలో మూడు విధములున్నవి. జ్ఞానము, సుజ్ఞానము. ఇంద్రియముల ద్వారా, గ్రంథముల ద్వారా, ఇతరుల ద్వారా ప్రపంచముయొక్క స్వరూప లక్షణాలను తెలుసుకొనేది, జ్ఞానము. తనకు కాని, పరులకుగాని, అపకారము దుఃఖము, బాధ, అలజడి, కీడు యేమీ కలిగింపక విచారణాశక్తిని వినియోగించుకొనేది సుజ్ఞానము. శుద్ధాంతఃకరణమును సంపాదించుకొని, దాని ద్వారా సత్యము, అహింస, సహనము మొదలైన దైవీగుణములను పెంపొందించుకొనిన తరువాత, వాని ఆత్మస్థానమునుంచి బయలుదేరే ఊహలంతా విజ్ఞనమే.

మానవత్వము సదసత్ మిశ్రమైనది. దేహము అసత్, ఆత్మ సత్. మన సత్యము ఆ పరమాత్మలో లీనమైనప్పుడు సత్యస్య సత్యము గోచరమగును. దీనకి చేయు ౹యత్నమే జీవితముయొక్క ప్రధాన కర్తవ్యము, అదే విజ్ఞాన సంపాదన. పాశ్చాత్యుల దృష్టిలో విజ్ఞానమంటే ఇది కాదు. బుద్ధి శక్తిని పురస్కరించుకొని మానవులు కొన్ని నిర్ణయాలను అనుమోదించుచున్నారే, వాటిని వారు విజ్ఞానమంటున్నారు. భారతీయ విజ్ఞానము యెవరికీ హానినందించదు. ఈశ్వర స్సర్వ భూతానాం హృద్దేశేర్జున తిష్ఠతి అనే విశాలభావమును, ప్రేమతత్త్వమును, అహింసా సందేశమును ప్రబోధించేది భారతీయ విజ్ఞానము. తనకూ పరులకూ ఏకొంత అపకారములేక, జనులను శాంతపరచి ఆనందపరచేదాన్ని భారతీయులు విజ్ఞానము అంటారు. జ్ఞానమునకుగాని, సుజ్ఞానమునకుగాని విజ్ఞానమునకుగాని బుద్ధి మూలాధారముగా వెలుగుచున్నది. బుద్ధి సుప్రీంకోర్టు. ఆ కోర్టు చేయు తీర్పుకు అడ్డులేదు. దీన్ని పురస్కరించుకొని గాంధీగారుకూడ, 'సబ్‌కో సన్మతి దే భగవాన్' అని తనూ ప్రార్థించి ఆ ప్రార్థనను అందరి నోటిలోనుండి పలుకరించినారు. సన్మతి లభించిన, సర్వకర్మలనూ దానితో పరీక్షించి ఏది ఉత్తమము ఏది అధమము అని నిర్ణయము చేయవచ్చును. భగవత్ శక్తిని ఆశ్రయించుకొనేదే వవిదేశీయుల బానిసతనమునుంచి విడుదలపొందే ఉపాయమని తలంచి, అందరికీ పవిత్రమైన సన్మతి దొరకని, అని గాంధీజీ వేడుకొన్నాడు.

భారతీయ ఆధ్యాత్మిక పద్ధతిలో దేహమునకు విలువ వున్నది. దానిని హింసించవలెను, త్యజించవలెను అని ఎవరూ ఉపదేశించరు. దానిని హింసించకూడదనే భారత సంస్కృతియొక్క సందేశము. దేహము దేవమందిరము. సదాచార సత్సంగము సత్కర్మలు వీటికంతా దేహము అత్యవసరము. దేవుని సందర్శించుకోటానికి దేహముండియే తీరాలి. భ్రమించే మనస్సు, చలించే బుద్ధీ రెండూ లేక, సాక్షాత్కారమనే దీక్షను పట్టి దానిని సాధించుకోవాలి.

దేవకార్యమును చేపట్టిన తరువాత సుఖముగానీ, దుఃఖముగానీ యేదీ అడ్డువచ్చిననూ లెక్కచేయకూడదు. హనుమంతుడు రామాజ్ఞను శిరసావహించి నిద్రాహారములు మాని సీతాదేవిని శోధించాడు. అన్ని ప్రదేశములను తిరిగాడు. సాగరమును దాటి గగన మార్గమున లంకాద్వీపమునకు ప్రయాణమైనాడు. మార్గమధ్యమున మైనాకపర్వతము సముద్రమునుండి లేచి పైకి వచ్చి, 'హనుమంతా! చాలా అలసిపోయినావు. కొనితసేపు విశ్రాంతి తీసుకొని, పర్వతాగ్రములోని వన్యఫలములనారగించి తరువాత మీ ప్రయాణమును కొనసాగించు' అని వినయవిధేయతలతో వేడుకొన్నది.

అయితే హనుమంతుడు, 'నేను రామకార్యమై వెడుతున్నాను. నాకు విశ్రాంతి అక్కరలేదు. ఆజ్ఞను సాధించేవరకు నాకు

నిద్రాహారములతో పనిలేదు' అని ఆమె కోరికను నిరాకరించాడు. చూడండి! మైనాకము కొంజాతి. అయిననూ ఆ సేవాబుద్ధి ఆ దయార్ద్ర హృదయము, ఆ వినయవిశ్వాసములు, ఆ చల్లని పలుకు, ఆ రామభక్తి ఎంత గొప్ప! ఏంత పరిశుద్ధము! హనుమంతుడా! కోతిజాతి. అయిననూ స్వామి ఆజ్ఞపై ఒత భయము, భక్తి, విస్వాసము, ఎంత నిష్ఠ, ఎంత ఏకాగ్రత! మనకు జాతి కాదు ముఖ్యము. నీతి ముఖ్యము. ఆ నీతి వలననే విజయప్రాప్తి. కొండ, కోతి వీటికంటె వివేకమూ, విజ్ఞానమూ మానవులమైన మనకు లేని యెడల సిగ్గుపడాలి. దీనులను చూచి జాలికలిగి వారికి సాయపడి సేవచేయవలెననేది మైనాకపర్వతముయొక్క బోధ. మాధవత్వమును పొందవలెనన్న మాధవుని ఆజ్ఞననుసరించి వర్తించవలెననేది హనుమంతుని బోధ.

ఈ గుణముల నభివృద్ధి చేయుననదే ఆధ్యాత్మిక మార్గము. త్రాడు స్వరూపమును పాముగా తలంచి భయభ్రాంతులకు వశమై బాధపడే స్వభావమునకు సిగ్గుపడి ఆధ్యాత్మిక మార్గముయొక్క అంతిమ గురి 'సర్వం ఖల్విదం బ్రహ్మ' అని తెలుసుకొనేది దాని ఫలితము. దారములేని వస్త్రము లేదు. బంగారము లేని నగలేదు. మట్టిలేని కుండ వుండదు. బ్రహ్మము లేని జగత్తు వుండదు. బ్రహ్మమయమైన కాయము బ్రహ్మమయమైన ప్రకృతియందు బ్రహ్మమయమైపోవటమే ప్రధాన కార్యము. ఇట్టి పవిత్ర జ్ఞానమును వికసింపజేసే ప్రయత్నము సలుపటమే ఉచిత మార్గము, ఉత్తమ మార్గము.

'కోహం, కోహం' ఏడ్పుతో మానవుడు పుట్టుచున్నాడు. అపుడు బంధుమిత్రులు సంతోషముగా నవ్వటానికి ప్రారంభింతురు. పుట్టిన బిడ్డకు ఏడ్పు, పెద్దలకు లోకవాంఛ! లోకవాంచలు తెలియని పిల్లవానికి దేవవాంఛ! జనన ముహూర్తమున యిట్లయితే, అంత్య ముహూర్తమందు వాంఛారహితుడై నిర్మల హృదయముతో సోహం అనే సమాధానముతో జ్ఞానప్రకాశముతో ప్రాణము విడువ వలెను. భక్తులు ప్రశాంతముగా, ఆనందముగా ఆ సమయమున నవ్వుతుంటే, బంధుమిత్రులు తమకు లోటు కల్గినదే అని ఏడ్వ మొదలిడుదురు. కనుక, దేహము పవిత్ర కర్మల నిమిత్తమై ప్రాప్తించినదని తెలుసుకోవలెను. మనోబుద్ధులను ఉత్తమ మార్గమున వికసింపజేసి ఆత్మను పరమాత్మునితో లీనమొనర్చి జీవితమును సార్థకముగావించుకొనవలెను.

స్థూల శరీరముతో సత్కర్మలనాచరించి, సూక్ష్మశరీరముతో సచ్చింతలనభివృద్ధి చేసుకొని, కారణశరీరముతో ఆత్మ సామ్రాజ్యమును జయించి సాక్షాత్కారము పొందవలెను.

(భగవాన్ శ్రీశ్రీశ్రీ సత్యసాయిబాబావారి 46వ జన్మదిన దివ్యసందేశము)